గడప వద్దకే సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, నూరిఫాతిమా



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న నూరిఫాతిమా

- సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు సీఎం జగన్‌కు మాత్రమే సాధ్యం
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమాతో కలిసి ఐదో డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధిని గడప వద్దకు చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య చెప్పారు. ఈమేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమాతో కలిసి ఐదో డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ రైల్వే గేటు నుంచి గణేశ్వరరావు వీధి, మంగళబావి సందు, శనక్కాయల ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రోశయ్య మాట్లాడుతూ టీడీపీ ప్రజలను పూర్తి స్థాయిలో మోసం చేస్తుందని తెలిపారు. ఎప్పుడూ స్థానికేతరులను నిలబెట్టి గెలిచిన తరువాత కనీసం కనబడకుండా తిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, రానున్న ఎన్నికల్లో మేలు చేసే వ్యక్తులను ఎన్నుకుంటే ఐదేళ్ల మన జీవితాలకు మంచి జరుగుతోందన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌ను గెలిపిస్తే ఇప్పుడు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని, కుట్రల కూటమికి ఓటు వేస్తే మన జీవితాలను మనమే నాశనం చేసుకున్నవారమవుతారన్నారు. తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175కు 175 స్థానాలు గెలవడం తథ్యమని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ జగనన్నే సీఎం అవుతారని తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు వస్తున్న స్పందన చూసి ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, దాడులకు తెగబడ్డా వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఏమాత్రం భయపడరన్నారు. ఫ్యాను గాలి ప్రభంజనం సృష్టించడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాట్ల రవి, వైఎస్సార్ సీపీ నేతలు పసుపులేటి రామయ్య, పోతురాజు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, లూకా, ఇజ్రాయిల్, వెంకట్, వెంకటరెడ్డి, మునిరత్నం, పల్లా శ్రీనివాస్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన టీడీపీ ముఖ్యనేతలు...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 7వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు అమినుల్లా, టీడీపీ ముఖ్యనేతలు అబ్దుల్ మొహమ్మద్ జుబేర్, షరీఫ్, నయీమ్, అహ్మద్, నూరి, పటాన్ చోహెల్, గఫార్, నాగుల్ షరీఫ్, ఖలీల్, జాకిర్, అబ్దుల్ రహీంలతోపాటు, ఆపార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే 15వ డివిజన్ మైనార్టీ నేతలు సలీం పార్టీలోచేరగా, బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

యువత గ్రంథాలయాల బాట పట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి సుబ్బరత్తమ్మ

పొన్నూరు : ఇంటర్నెట్ విస్తృతి నేపథ్యంలో యువత చరవాణులకే పరిమితం కాకుండా విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాల బాట పట్టాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుబరత్తమ్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. పాత పొన్నూరులోని గ్రంథాలయాన్ని ఆమె శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులను ఉద్దేశించి సుబ్బరత్తమ్మ మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు ప్రభుత్వం గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. యువత విధిగా వార్తా పత్రికలు, పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆమె వెంట పొన్నూరు గ్రంథాలయ అధికారి కృష్ణ మోహన్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ



మాట్లాడుతున్న ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ

ప్రత్తిపాడు: మాదిగల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ఏమీ చేయలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పల్లెపోగు పాపారావు మాదిగ అధ్యక్షతన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గత పదేళ్లగా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మాదిగల్ని ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప వారి సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. క్రైస్తవులపై దాడులు కూడా పెరిగాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ



మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు ఆర్‌టీఏ ఆధ్వర్యంలో మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి రవాణాశాఖ అధికా రులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో ఆర్‌టీఓ గోపాల్ ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లీశ్వరి, సంధ్య కాంటాక్ట్ క్యారేజి బస్సులు, కంటైనర్ లారీలను ఆపి వాటిలోని సరుకులను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏవైనా సరుకులు రవాణా చేసినట్లయితే కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేయడం జరుగుతుందని రవాణా శాఖ అధికారులు బస్సు డ్రైవర్లను హెచ్చరించారు.

నీటి కుంటలతో భూగర్భ జలాల పరిరక్షణ



గుండాలపాడులో ఉపాధి పనుల్లో కూలీలు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. పొలాల్లో నీటి కుంటల ఏర్పాటు చేయడంతో భూగర్భజలాల వృద్ధి చెంది పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవిలో పశువులకు తాగునీటి కొరత అరికట్టవచ్చని వివరిస్తున్నారు. మండలంలో ఎనిమిది వేలమంది ఉపాధి కూలీలు ఉండగా శనివారం ఐదువేల 802 మంది పనులు చేస్తున్నారు. పంటకాలువల్లో పూడికతీత, చెరువులలో పూడికతీత, పొలాల్లో నీటి కుంటల తవ్వకాలు వంటి పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. నిర్ణీత సమయం లేకుండా కేటాయించిన పరిధిలో పనిని నిర్వహించినందుకు రోజుకు రూ.300 కూలీగా నిర్ణయించినట్లు చెప్పారు. కూలీలు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా అందుబాటులో మెడికల్ కిట్లు ఉంచినట్లు ఉపాధి హామీ పథకం అధికారులు వెల్లడించారు.

కోనేటి చెరువులో నీటి నమూనా సేకరణ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గ్రామానికి నీటి సరఫరా చేసే కోనేటి చెరువు వద్ద శనివారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రామాంజనేయులు, గోపి, తయూబ్ నీటినమూనా పరీక్షలు చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ కొత్తగా సాగర్ జలాలు చెరువుకు వచ్చినందు వలన వాటిలో మలినాలు ఉన్నాయా లేవా అనేదానిపై నీటి నమూనా పరీక్షలు చేయించినట్లు తెలిపారు. ట్యాంకు వద్ద బ్లీచింగ్ కలిపిన నీరు క్లోరినేషన్ అయిన తరువాత దానిని పరీక్షించి సరి అయిననీరు అయినచో వాటిని గ్రామంలోకి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌యూ, హార్డ్‌నెస్, ఆల్కనాలిటీ, ఫ్లోరైడ్, నైట్రేట్, ఐరన్, రెసిబుల్ క్లోరిన్ వంటి పరీక్షలు చేసి పరీక్షించిన తరువాత నీటిని గ్రామంలోకి వదులుతున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట సర్పంచి మేడాబాబు ఉన్నారు.

వివాదాలకు దూరంగా.. కుటుంబానికి దగ్గరగా ఉండండి

రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: వివాదాలకు దూరంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని నల్లపాడు సీఐ నరేశ్ కుమార్ రౌడీషీటర్లకు సూచించారు. అలాకాదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శనివారం అడవి తక్కెళ్లపాడు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరి కదలికలపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

వందమీటర్ల పరిధిలో వాహనాలు నిలపొద్దు

ప్రత్తిపాడు: నామినేషన్ల పర్వం కొనసాగుతున్న నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ ఉంటుందని ప్రత్తిపాడు నోడల్ అధికారి, సీఐ ఎండీ నిసార్ బాషా స్పష్టం చేశారు. ప్రస్తుతం రిటర్నింగ్ కార్యాలయ ఆవరణకు పార్టీ ప్రచార వాహనాలు వచ్చే సమయంలో మైకులు ఆపి వెళ్లమని చెబుతున్నామని ఆయన తెలిపారు. ఉద్యోగులు లోపలికి వెళ్లేందుకు కేవలం ఒక్క వాహనానికి వీలుగా దారి ఉంచామన్నారు. పార్టీలకతీతంగా అందరికీ ఒకేలా నిబంధనలుంటాయని సీఐ బాషా చెప్పారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులో శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో మచిలీపట్నం పోర్టు ట్రస్ట్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రామకోటమ్మ, మండల నాయకులు ఉడతా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.66 వేలు స్వాధీనం

తాడికొండ: రాయపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.66 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఈ అశోక్ గౌడ్ తెలిపారు. శనివారం ఉదయం రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వై జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్. సాంబశివ నాయుడు కారులో రూ.66 వేల నగదును తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన రసీదులు చూపించక పోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అలరించిన మ్యాజిక్ షో



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ కూడలిలోని కోదండ రామాలయంలో శ్రీ రామనవమి మహోత్సవాలల్లో భాగంగా శనివారం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజలను వేద పండితులు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మెజీషియన్ నాగేంద్రప్రసాద్ బృందం మ్యాజిక్, టాకింగ్ డాల్ షోలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మినేని శివకోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షులు కిలారి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, కిలారి రత్తయ్య, సీతారామయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా శారా కుగ్లర్ జయంతి



నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోని కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలో శనివారం డాక్టర్ అన్నా శారా కుగ్లర్ 168వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రెవ.జె.దైవాశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 80 మంది చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో బత్తుల లెనిన్, బి.సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీపై వైద్యాధికారులకు శిక్షణ

గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్‌లకు శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్స్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గర్భిణికి వైద్యాధికారి మాత్రమే బీపీ పరీక్ష చేయాలని చెప్పారు. ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులను గుర్తించడంలో భాగంగా వీలైనంత త్వరగా ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు నిర్వహించి తరచూగా వారికి ఆరోగ్యంపై మెలకువలు తెలియజేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను హెల్త్ విజిటర్ లేదా పబ్లిక్ హెల్త్ నర్సుకు ట్యాగ్ చేసి కాన్పును పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా సేఫ్ డెలివరీ క్యాలెండర్‌ను ప్రదర్శించి కాన్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. డాక్టర్ చరణ్‌తేజ్, డాక్టర్ రేష్మ, డీపీహెచ్‌ఎన్‌ఓ శాంతకుమారి, హెచ్‌ఈఈఓ కె.పి.చంద్రశేఖర్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్యాగు చోరీపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: ద్విచక్రవాహనానికి తగిలించిన బ్యాగు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 3/2లైనులో ఈనెల 14వ తేదీ కరుణశ్రీ అనే మహిళ హ్యాండ్‌బ్యాగును ద్విచక్రవాహనానికి తగిలించి టిఫిన్ సెంటర్‌లోకి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బ్యాగు కనిపించలేదు. బ్యాగులోని రూ.25వేలు నగదు, రెండు సవర్ల బంగారు గొలుసు, స్థలం డాక్యుమెంట్లు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్య చేసుకుని మహిళ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయినగర్ 3వలైనులో నివశించే మూరబోయిన గురవయ్య, అనంతలక్ష్మి (22)లకు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. అనంతలక్ష్మి అనారోగ్య కారణంతో శనివారం బాత్‌రూములో యాసిడ్ సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే అనంతలక్ష్మిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పెదబాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న జంగాల అజయ్ కుమార్ నామినేషన్

లక్ష్మీపురం: ఈనెల 23వ తేదీన సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ నామినేషన్‌ను వేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు తెలిపారు. శనివారం స్థానిక కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మార్కెట్ సెంటర్ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లనున్నామన్నారు. నామినేషన్‌కు అన్ని సిద్ధం చేయడం జరిగిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో అన్నదానం గొప్పది



పట్నంబజారు: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నాల్గో డివిజన్ తమ్మా రంగారెడ్డినగర్, 14వ డివిజన్ కబడీ గూడెంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిదానాల్లోకి అన్నదానం ఎంతో పుణ్య కార్యమన్నారు. నాల్గో డివిజన్ కార్పొరేట్ మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు కేసరి సుబ్బులు, సుబ్బారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రమణారెడ్డి, గోపి, హరీష్, దాసరి రాము, అహ్మద్, జాని, నూర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



ఎస్వీఆర్ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఆర్ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శనివారం ఆయనను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్వీఆర్ ప్రసాద్ విద్యాశాఖకు విలువైన సేవలు అందించారని అన్నారు. ఉపాధ్యాయ నియామకాలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ సమయాల్లో సబ్జెక్టు నిపుణుడిగా నియమ, నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహనతో సమన్వయం చేసేవారని కొనియాడారు. డీసీఈబీ కార్యదర్శి లలిత ప్రసాద్ మాట్లాడుతూ నీతి, నిజాయితీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, అందరి మన్ననలు పొందారని అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, గుంటూరు ఈస్ట్-1 ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు, సీనియర్ హెచ్‌ఎంలు ఎ.తిరుమలేష్, బి.విజయలక్ష్మి, డీఈఓ, సమగ్రశిక్ష, ఆర్జేడీ కార్యాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్ని మాపక వారోత్సవాలు



పరికరాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం అజిత కుమారి

పొన్నూరు : సెల్లార్లను వాహనాల పార్కింగుకు మాత్రమే వినియోగించాలని, ఇతర కార్యక్రమాలు చేపట్టవద్దని పొన్నూరు అగ్ని మాపక కేంద్రాధికారి కె. ప్రసాదరావు సూచించారు. సెల్లార్లలో ఇతర కార్యక్రమాలు చేపడితే అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదముందని ఆయన తెలిపారు. అగ్ని మాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఆదర్శ్ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, ఆర్టీసీ డీఎం అజిత కుమారి హాజరైన వారోత్సవాల్లో విద్యార్థులకు గ్యాప్, విద్యుత్ వినియోగాన్ని వివరించారు.

ఆరోగ్యంపై జాగరూకత అవసరం

ఆచార్య ఎన్జీ రంగా వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు రూరల్: ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ జాగరూకతతో వ్యవహరించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి సూచించారు. శనివారం లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎండోలైఫ్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి, కొనాక్ డయాగ్నస్టిక్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ విషయంలో రోజుకు గంటపాటు వ్యాయామం లేదా ఆటలైనా ఆడాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు సాయిబాబు, ప్రత్యూష, నజ్మ, సీఎస్ రావు, ఎస్ కిశోర్ కుమార్‌లు పరిశోధన కేంద్రంలోని భోధన, భోధనేతర సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీ సాంబశివరావు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, ఎమ్ సుమంత్, గోపీచంద్, అశోక్, దాల్మిక, కోటేశ్వరరావు శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో అదుపులోకి అతిసారం

సకాలంలో స్పందించిన అధికారులు వైద్య సిబ్బంది

చేబ్రోలు: చేబ్రోలు మండలం మంచాలలో అతిసార అదుపులోకి వచ్చింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారి సంఖ్య శనివారం నాటికి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని అధికారులు ఏర్పాటు చేసారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితులను ఎప్పటికప్పుడు తరలించడంతో మెరుగైన ఫలితం కనిపించింది. మొదటి రోజు శిబిరంలో చేరినవారంతా ఆరోగ్యవంతులుగా ఇంటికి వెళ్లినట్లు వైద్యాధికారులు తెలిపారు. గ్రామంలో అతిసార ప్రభావం పూర్తిగా అదుపులోకి వచ్చిందని వారు తెలిపారు. అటు చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న ఆరుగురి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. మరికొద్ది రోజుల పాటు వైద్యశిబిరాన్ని కొనసాగించనున్నట్లు వైద్యాధికారులు చెప్పారు.తెనాలి డిప్యూటీ డీఎంహెచ్ ఓ అన్నపూర్ణమ్మ, చేబ్రోలు తహసీల్దారు రమాదేవి, వైద్యాధికారి అబ్రహం లింకన్, పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావులు పర్యవేక్షిస్తున్నారు.

నేడు 'గో టు హెల్' సాంఘిక నాటకం ప్రదర్శన



కరపత్రాన్ని ఆవిష్కరించిన సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రసఝరి-పొన్నూరు సమాజంచే ప్రదర్శించే ఈ నాటకాన్ని స్వర్గీయ గొల్లపూడి మారుతీరావు రచించారు. రంగస్థల/సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహిస్తారు. కార్యక్రమ కరపత్రాన్ని శనివారం గాంధీనగర్‌లో ప్రముఖ సినీ మాటల రచయిత, కళల కాణాచి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. నాటక ప్రదర్శనకు ముందు ఆరు గంటలకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగే సభలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి 'ప్రైడ్ ఆఫ్ తెనాలి' పురస్కారం ప్రదానం చేస్తారు. అజో-విభో-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ పురస్కార ప్రదాతగా వివరించారు. చెరుకుమల్లి సింగారావు, ఎం.రామలింగేశ్వరుడు, కొండముది రమేష్, బడుగు మోహనరావు, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

రామాలయంలో అన్న సమారాధన



తెనాలిఅర్బన్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బోసురోడ్డులోని శ్రీ సీతారామ మందిరం వద్ద శనివారం సీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో పి.కృష్ణవేణి, జీఎం కె.మాధవి, బీజీఎం కె.జయలక్ష్మి, అన్నదాన కమిటీ అధ్యక్షులు దొప్పలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. 42 ఏళ్ల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీరు తెలిపారు. కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు 10 వేల మందికి అన్న సంతర్పణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలాజీ ప్రసాద్, ఎస్.శ్రీనివాసన్, శేషగిరి, పావులూరి నాగేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.